సుధాకర్‌ను ఆశీర్వదించండి

- పట్టభద్ర ఓటర్లను కోరిన ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్
- పలు గ్రామాల్లో ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


పాలకొండ: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


భామిని: కోసలిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, వైస్ ఎంపీపీ శ్రీదేవి


జియ్యమ్మవలస: సుధాకర్‌కు మద్దతివ్వాలని పెదమేరంగి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను కోరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పాలకొండ రూరల్: అంపిలిలో ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు


గరుగుబిల్లి: గరుగుబిల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం


పాలకొండ: నగరపంచాయతీ 10వ వార్డులో కౌన్సిలర్ల ప్రచారం

భామిని: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను పట్టభద్ర ఓటర్లు ఆశీర్వదించి, భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. మండలంలోని ఘనసర, కోసలి, కీసర, సతివాడ, ఘనసర కాలనీలో గురువారం సుధాకర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్ర ఓటర్ల ఇంటికి వెళ్లి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించడం ద్వారా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీలు మజ్జి శ్రీదేవి, బి.ధర్మారావు, జిల్లా కార్యదర్శి కె.చిరంజీవులు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఎం.మోహనబాబు, కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావు, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, ఎంపీటీసీలు టింగ అన్నాజీరావు, పి.రాంబాబు, సర్పంచ్‌లు కిల్లారి కమల, పి.రామారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే చిన్నదిమిలి, కొరమల గ్రామాల్లో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు.

బెజ్జిలో ఎమ్మెల్సీ విక్రాంత్ ప్రచారం

పాలకొండ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానికి వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. మండలంలోని బెజ్జి గ్రామంలో గురువారం పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్ర ఓటర్ల ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాషరావు, కోట అజయ్‌కుమార్, శివ్వాల శ్రీనివాసరావు, రణస్థలం రాంబాబు, వావిలపల్లి రాజారావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావును గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. మండలంలోని అంపిలి, ఎం.సింగుపురం, కోటిపల్లి, బాసూరు, ఓని తదితర గ్రామాల్లో గురువారం వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు తదితరులు ప్రచారం చేశారు.

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, బిత్రపాడు, గెడ్డతిరువాడ తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, మరడాన కిశోర్, వాన నారాయణరావు, లోలుగు నారాయణరావు, రెడ్డి రవికుమార్ తదితరులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేపట్టారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన


భామిని: కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు వంశధార వరద కాలువ బాధితుల సమస్యలను గాలికొదిలేసి, పరిహారం పేరుతో ఆ కాంట్రాక్టర్‌ను దోచుకున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. మండలంలోని ఘనసర కాలనీలో సామాజిక భవన నిర్మాణానికి గురువారం ఆమె భూమిపూజ చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. వంశధార వరద కాలువ బాధితుల కోరిక మేరకు సాయిలక్ష్మి కన్‌స్ట్రక్షన్ వారితో మాట్లాడి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు చెప్పారు. అనంతరం సర్పంచ్ కిల్లారి కమల, ఎంఎస్ కోశాధికారి ఎరుకుమజ్జి భారతి, స్థానికులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంప్రసాద్ పాత్రో, ఎరుకుమజ్జి పాపినాయుడు పాల్గొన్నారు.

ఎంఎంఎస్ అధ్యక్షురాలికి ఎమ్మెల్యే అభినందన

వీరఘట్టం: మండల మహిళా సమాఖ్యకు అనతి కాలంలోనే జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన అధ్యక్షురాలు పి.సుజాతను గురువారం వండవ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అభినందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళాభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను డ్వాక్రా మహిళలకు చేరవేసేందుకు కృషి చేయాలని సూచించారు.

క్లుప్తంగా

పక్కాగా ప్రీఫైనల్ పరీక్షలు


రేగులపాడు కేజీబీవీలో ప్రీ ఫైనల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

వీరఘట్టం: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు గంగమ్మపేట ఆశ్రమ పాఠశాల, రేగులపాడు కేజీబీవీలో జరుగుతున్న పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను ఎంఈఓ పర్రి కృష్ణమూర్తి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రిఫైనల్ పరీక్షలు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఏప్రిల్ 3 నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఆయా కేంద్రాల్లో 668 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


పిల్లల బరువు చూస్తున్న సీడీపీఓ విమలారాణి

భామిని: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కొత్తూరు సీడీపీఓ టి.విమలారాణి అన్నారు. మండలంలోని దిమ్మిడిజోల అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. పిల్లల ఎత్తు, బరువు, హెల్త్ రికార్డులు, పౌష్టికాహార పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. బరువు తక్కువ ఉన్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని, పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని కార్యకర్త సత్యవతికి సూచించారు.

పొల్ల సచివాలయం సందర్శన


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: మండలంలోని పొల్ల గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ కోసూరు గీతాంజలి గురువారం సందర్శించారు. సిబ్బంది హాజరు, వివిధ శాఖలకు సంబంధించిన రికార్డులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. మిషన్ అంత్యోదయ సర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, చెత్త సేకరణ, కంపోస్టు తయారీపై అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు.

జేసీ పరిశీలన


పర్యాటకాభివృద్ధి పనులు పరిశీలిస్తున్న జేసీ ఆనంద్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎస్.కె.పాడు ఉద్యానవన నర్సరీలో చేపడుతున్న పర్యాటకాభివృద్ధి పనులను పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ గురువారం పరిశీలించారు. నర్సరీలో బోటింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటు చేసేందుకు చెరువులను సిద్ధం చేస్తున్నారు. అలాగే హట్స్, రెస్టారెంట్, రోడ్డు నిర్మించేందుకు ల్యాండ్ లెవెలింగ్ పనులు జరుగుతున్నాయి. పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ జె.రాములమ్మ, హార్టికల్చర్ సబ్‌అసిస్టెంట్ కృష్ణారావు ఉన్నారు.

18 ఏళ్లు నిండినవారిని ఓటర్లుగా చేర్చండి


బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్

కొమరాడ: గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన వయోజనులను ఓటర్లుగా చేర్పించే బాధ్యత బీఎల్‌ఓలపై ఉందని సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఓటరు నమోదుతో పాటు ఓటరు గుర్తింపు కార్డుతో ఆధార్ కార్డును అనుసంధానంపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో అలసత్వం వహించొద్దు


సిబ్బందితో సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

గరుగుబిల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లపై గురువారం సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలన్నారు. ఓటరు జాబితాలపై ఫిర్యాదులు వస్తే సంబంధిత బీఎల్‌ఓలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ బాక్సులు తెరిచినపుడు, సీల్ వేసినపుడు తప్పనిసరిగా వీడియోను చిత్రీకరించాలన్నారు. తహసీల్దార్ అజూరఫీ జాన్, ఆర్‌ఐ కృష్ణ, ఉపతహసీల్దార్ ఎస్.శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

పాలకొండ: రెవెన్యూ ఉద్యోగులు గురువారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. భోజన విరామ సమయంలో యూనియన్ నాయకులు బి.బుచ్చయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

వీడని ఏనుగుల బెడద

గరుగుబిల్లి: గత కొన్నేళ్లుగా ఈ ప్రాంత వాసులను ఏనుగుల బెడద వీడడం లేదు. పంటలు ధ్వంసం చేస్తుండడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని లఖనాపురం, పెదబుడ్డిడి తదితర ప్రాంతాల్లో రెండు రోజులుగా ఏనుగుల గుంపు సంచరిస్తోంది. గురువారం గిజబ, వెంకటాపురం ప్రాంతాల్లో గజరాజులు ప్రత్యక్షమయ్యాయి. ఈ ప్రాంతంలో అరటి, మొక్కజొన్న, చెరుకు పంటలు సాగులో ఉండడంతో వాటిని ధ్వంసం చేస్తాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగులను ఇక్కడ నుంచి తరలించి తమకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

11న వాహనాల వేలం

జియ్యమ్మవలస: సారా కేసులలో పట్టుబడిన వాహనాలను ఈనెల 11న వేలం వేయనున్నట్లు చినమేరంగి ఎస్సై కళాధర్ గురువారం తెలిపారు. 14 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో వేలంలో ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్‌కార్డుతో పాటు కాషనరీ డిపాజిట్ రూ.1000లు కట్టి ఉదయం 10 గంటలకు జరిగే వేలంలో పాల్గొనవచ్చన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

సీతానగరం: రైతులు, పశువుల కాపరులు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో 15,700 పశువులున్నాయని, మార్చి 1 నుంచి 31 వరకూ ఆర్బీకేల్లోని పశువైద్య కేంద్రాల్లో టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 1000 పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు.

సేంద్రియ ఎరువులతో సాగుకు మేలు


ప్రకృతి సాగుపై అవగాహన కల్పిస్తున్న వెలుగు రిసోర్స్ పర్సన్

భామిని: ప్రకృతి వ్యవసాయ విధానంలో వినియోగించే సేంద్రియ ఎరువులతో సాగుకు మేలు జరుగుతుందని వెలుగు రిసోర్స్ పర్సన్ పాలక నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని మూలగూడలో గురువారం వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ఆదివాసీలకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఘన, ద్రవజీవామృతం, నీమాస్త్రం, పంచపత్ర కషాయం, అగ్నిఅస్త్రంతో చీడపీడలను సమర్థవంతంగా నివారించొచ్చన్నారు. వాటిని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. వెలుగు ఏసీఓ ఎస్.ఆనందరావు, సీఓ బి.ఫకీరు, మొబిలైజర్ బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

14న డీవార్మింగ్ డే


మాట్లాడుతున్న పీఓ నవ్య

సీతంపేట: ఈనెల 14న డీవార్మింగ్ డేను పక్కాగా నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.నవ్య ఆదేశించారు. గురువారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎంపీడీఓలు, సీడీపీఓలు, ఎంఈఓలు, స్కూల్ యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1-19 సంవత్సరాల మధ్య వయసు పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండోజల్ మాత్రలు వేయించాలన్నారు. 14వ తేదీన మాత్రలు వేసుకోలేని వారికి 18న ఇవ్వాలని సూచించారు. వైద్యాధికారులు వారి పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలలతో సమన్వయం చేసుకొని డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. దీనిపై తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతీ, ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ యుగంధర్, ఏఎంఓ పి.కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు, జీసీడీఓ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

గుమ్మలక్ష్మీపురం: రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలు పాటించాలని తహసీల్దార్ జె.రాములమ్మ కోరారు. స్థానిక విలేకరులతో గురువారం ఆమె మాట్లాడుతూ..ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల తర్వాత ఎటువంటి ఎన్నికల ప్రచారం చేయరాదని సూచించారు. అలాగే పోలింగ్ జరిగే రోజున పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే వాహనాలు నిలిపివేయాలని, అనుమతి లేని వ్యక్తులు పోలింగ్ కేంద్రంలోనికి వెళ్లరాదని, ఎటువంటి ప్రచారాలు చేయకూడదన్నారు. పోలింగ్ రోజున రాజకీయ పార్టీలు పంచిన స్లిప్పులపై ఎటువంటి గుర్తులు ఉండకూడదని, ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళ్లే ఓటర్లతో ఇతరులు, సెక్యూరిటీ గన్‌మేన్ పోలింగ్ కేంద్రం లోనికి వెళ్లరాదని సూచించారు. అలాగే పోలింగ్ రోజున ఓటర్ల సౌలభ్యం కోసం అభ్యర్థులు ఎటువంటి వాహనాలు ఏర్పాటు చేయకూడదని, ర్యాలీలు గానీ, ఊరేగింపులు గానీ నిర్వహించకూడదని, ముఖ్యంగా పోలింగ్ స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ అమలు పరుస్తున్నందున ఓటర్లు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆమె కోరారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ


గర్భిణులకు భోజనం అందజేస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్, సత్యసాయి భక్తులు

వీరఘట్టం: స్థానిక పీహెచ్‌సీకు ఆరోగ్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు చిట్టపులివలస జంక్షన్‌లో ఉన్న సత్యసాయిబాబా నిత్య అన్నదాన సేవా కేంద్రం నిర్వాహకులు గురువారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి మాతృత్వ అభియాన్‌లో భాగంగా డాక్టర్ ప్రదీప్‌కుమార్ గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. అనంతరం శ్రీకాకుళం గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, పలువురు దాతల ఆర్థిక సహకారంతో గర్భిణులకు భోజనాలు సమకూర్చినట్లు అన్నదాన సేవా కేంద్రం ప్రతినిధులు తెలిపారు.

సేంద్రియ సాగుపై అవగాహన


అవగాహన ర్యాలీ చేస్తున్న వ్యవసాయశాఖ అనుబంధకులు

వీరఘట్టం: సేంద్రియ వ్యవసాయ విధనంలో పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచించారు. మండలంలోని నడిమికెల్ల గ్రామంలో గురువారం ప్రకృతిసాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాల సాగు, సేంద్రియ ఎరువుల వినియోగం, విత్తనశుద్ధి, జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. తొలకరి వర్షాలకు ముందు 30 రకాల విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసి చల్లుకోవడం ద్వారా నేలలో జీవ వైవిధ్యం పెరుగుతుందన్నారు. ఫలితంగా నేల సారవంతంగా మారుతుందన్నారు. ర్యాలీలో మండల యాంకర్ మారుతీ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పశువులు జాగ్రత్త


ఎల్విన్‌పేట సమీపంలో గడ్డి మేస్తున్న గేదెలు

గుమ్మలక్ష్మీపురం: వేసవి ప్రారంభమైంది. ఎండలు మండిపోతున్నాయి. వడదెబ్బకు గురికాకుండా మనం వివిధ జాగ్రత్తలు తీసుకుంటుంటాం. కానీ మూగజీవాలు తమ బాధను ఎవరితోనూ చెప్పుకోలేవు. వాటి ఆవేదనను మనమే అర్థం చేసుకుని ఎండల నుంచి వాటికి తగిన రక్షణ ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా పాడి పశువుల సంరక్షణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అవి వడదెబ్బకు గురై చనిపోయే ప్రమాదం ఉందని గుమ్మలక్ష్మీపురం పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు అంటున్నారు. వేసవిలో పాడిపశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో ఆవులు 83,954, గేదెలు 27,904, గొర్రెలు 35,412, మేకలు 58,457, కోళ్లు 2,54,317, పందులు 273 ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

గాలి ప్రసరించేలా పాకల ఏర్పాటు

గాలి, వెలుతురు సక్రమంగా ప్రసరించేలా పశువుల పాకలు నిర్మించుకోవాలి. వేసవిలో ఉష్ణోగ్రతను నియంత్రించేందుకు పాక చుట్టూ తడిపిన గోనె సంచులు ఏర్పాటు చేసుకోవాలి. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటే పశువులు ఎక్కువ మేతను తింటాయి. ఫలితంగా పాల దిగుబడి పెరుగుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేతకు బయటకు తీసుకెళ్లాలి. ఎక్కువగా నీరసించిన పశువులకు ఫ్లూయిడ్స్ ఎక్కించాలి.

వడదెబ్బపై అప్రమత్తం

ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ విభాగం అధికారులు హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు మనుషులతో పాటు పశువులు కూడా వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి పశువుల పట్ల పాడిరైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా సంకర జాతి, హెచ్.ఎఫ్ జెర్సీ ఆవులు 37 డిగ్రీల ఉష్ణోగ్రతకే ఇబ్బంది పడతాయి. శరీర ఉష్ణోగ్రత పెరిగి వేడిని అదుపులో ఉంచుకోవడానికి నోటి ద్వారా శ్వాస తీసుకుంటూ ఆయాస పడతాయి. మేతను సరిగా తీసుకోవు. వడదెబ్బకు గురికావడం, జ్వరం రావడం లేదా శరీరంలో నీటి శాతం తగ్గిపోయి మరణాలు కూడా సంభవించే ప్రమాదం ఉంది.

పశుపోషణకు మెలకువలు

ఎండుగడ్డిని రాత్రి లేదా చల్లని వేళల్లో మేపాలి. వేసవిలో పచ్చిమేత లభించేలా ముందస్తు చర్యలు చేపట్టాలి. లేదంటే పచ్చిమేతకు పాతర, అజొల్లా, మొలక గడ్డి రూపంలో పచ్చగడ్డిని అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. పచ్చి మేత, ఎండు గడ్డిని ముక్కలుగా చేసి మేపడం వలన 30 శాతం గడ్డి వృథా కాకుండా నివారించవచ్చు. అందుబాటులో ఉంటే పాడి ఆవులను రోజుకు రెండు, మూడు సార్లు చల్లని నీటితో కడిగితే మేలు.

పన్ను వసూలు లక్ష్యాలు చేరుకోవాలి: డీపీఓ


మాట్లాడుతున్న డీపీఓ సత్యనారాయణ

పాలకొండ రూరల్: మండలంలో శతశాతం ఇంటి పన్ను వసూలు లక్ష్యాన్ని మార్చి 15 నాటికి చేరుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వీఆర్వోలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో పంచాయతీల వారీగా పన్ను వసూళ్లపై సమీక్షించారు. పన్ను వసూలు వేగవంతం చేయాలని సూచించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో గ్రామ కంఠాల గుర్తింపునకు సంబంధించిన సర్వే క్షుణ్ణంగా చేపట్టాలన్నారు. ఎటువంటి వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ దొంక త్రినాథులు ఉన్నారు.

నేటి నుంచి మధ్యాహ్న భోజనంతో రాగిజావ


మాట్లాడుతున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు రాగిజావను అందించాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండల కేంద్రంలో ఎండీఎం నిర్వాహకులు, సీఆర్‌పీలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు రాగిజావను అందించాలని సూచించారు. విద్యార్థుల్లో రక్తహీనతను నివారించేందుకు రాగిజావ ఎంతో దోహదం చేస్తుందన్నారు. కొత్త మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళలను గౌరవించడం మన బాధ్యత


మాట్లాడుతున్న ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు సుజాత

వీరఘట్టం: తల్లిగా, చెల్లిగా, భార్యగా, స్నేహితురాలిగా సమాజంలో ఎంతో సముచిత స్థానం ఉన్న మహిళలను గౌరవించుకోవడం మన అదృష్టంగా భావించాలని తలవరం ఉన్నత పాఠశాల హెచ్.ఎం ఉప్పాడ అప్పారావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకని సహచర మహిళా ఉపాధ్యాయులను గురువారం సత్కరించారు. స్త్రీయే గమనం, స్త్రీయే జననం, స్త్రీయే సృష్టికి మూలం అంటూ స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళలు నినాదాలు చేశారు. వీరఘట్టం మండల మహిళా సమాఖ్యకు ఉత్తమ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు పి.సుజాత అన్నారు.